

బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

దేశంపై విదేశాల్లో రాహుల్ గాంధీ విషం చిమ్ముతున్నారు

ముషీరాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీపై అక్కసుతో విదేశాల్లో మనదేశంపై రాహుల్‌గాంధీ విషం చిమ్ముతున్నారని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ ఆరోపించారు. గురువారం ముషీరాబాద్‌లోని మున్సిపల్ కాలనీలో కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ బలోపేతం, భవిష్యత్‌లో అధికారంలోకి రావాలనే ఆకాంక్షతో సభ్యత్వ నమోదు కొనసాగుతుందన్నారు. కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్ ముదిరాజ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుషాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

అంబర్‌పేట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): పటేల్‌నగర్ చౌరస్తాలో బీజేపీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు దాసోజు నాగభూషణచారి ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మాజీమంత్రి సి. కృష్ణాయాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

గోల్నాకలో..

గోల్నాక: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్ రావు సూచించారు. గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ అధ్యక్షతన గంగానగర్‌లో డీ-మార్ట్ వద్ద నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి బూత్‌లో 200 మందికిపైగా సభ్యత్వాలను నమోదు చేయాలని సూచించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా రాహుల్ వ్యాఖ్యలు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్ ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో గురువారం బర్కత్‌పుర చమాన్ వద్ద ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడల్లా దేశంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మారిందన్నారు. ఈ పద్ధతికి స్వస్తి పలకపోతే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రాహుల్ భారత సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్, నాయకులు నందకిషోర్ యాదవ్, సి. వినోద్‌యాదవ్, ఎక్కాల కన్నా తదితరులు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్- పంచాయతీల నిర్వహణపై అవగాహన

రాంనగర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): యూత్ పార్లమెంట్-గ్రామ పంచాయతీల నిర్వహణపై డీడీ కాలనీలోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో గురువారం సదస్సు జరిగింది. విద్యార్థులకు వ్యవసాయం, విద్య, రైల్వే, ఆరోగ్య, పర్యాటక వంటి అంశాలపై శాఖలు కేటాయించి వాటి పనితీరుపై అవగాహన కల్పించారు. అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భవననిర్మాణ సంక్షేమబోర్డులో సభ్యత్వం తీసుకోండి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్(ఏసీఎల్) జాసన్ నగరంలో భవననిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో కార్మికులను కలిశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో సభ్యత్వం తీసుకోవాలని వారికి అవగాహన కల్పించారు. స్పెషల్ డ్రైవ్ మరో రెండు రోజుల్లో ముగుస్తుందన్నారు.

'విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి'

ముషీరాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదగాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి, ఉపాధ్యాయులు నరేందర్ యాదవ్, రతన్ పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై ట్రైనీ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

అంబర్‌పేట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రైనీ పోలీసులకు రోడ్డు భద్రతపై అంబర్‌పేట పీటీసీలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి, బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. లైసెన్స్‌లు లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానా, మూడు నెలల జైలు శిక్ష ఉంటుందన్నారు. వాహనం నడిపే వ్యక్తి వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రైనీ పోలీసుల సందేహాలకు వారు సమాధానం ఇచ్చారు.

అంబర్‌పేట అభివృద్ధికి నిధులు కేటాయించండి : ఎమ్మెల్యే

గోల్నాక, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించాలని జోనల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. గురువారం జోనల్ కమిషనర్ కిరణ్‌ను కలిసి ఐదు డివిజన్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ. 11 కోట్లతో సిద్ధం చేసిన ప్రతిపాదనలతో వినతిపత్రాన్ని అందజేశారు.

'కవాడిగూడలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి'

కవాడిగూడ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆకుల ప్రవీణ్ కోరారు. గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో పలు ప్రాంతాల్లో నిత్యం డ్రైనేజీలు పొంగుతున్నాయన్నారు.



బాగ్‌లింగంపల్లిలో మండపంలో పూజలు నిర్వహించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



భోలక్‌పూర్ పద్మశాలి కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్



గోల్నాక శంకర్‌నగర్‌లో వినాయక మండపంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

వినాయక మండపాల్లో

కొనసాగుతున్న పూజలు



దోమలగూడలో పూజలు నిర్వహించిన సీఐ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్‌లు రచనశ్రీ, గడ్డం మహాలక్ష్మి

ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో పూజలు కొనసాగుతున్నాయి. గురువారం కేంద్రం మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, సీఐ, ఎస్‌ఐలు, కార్పొరేటర్లు మండపాల్లో పూజలు నిర్వహించారు.



రాంనగర్ మోహన్‌నగర్‌లో వినాయక మండపంలో పూజలు నిర్వహించిన శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు



అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన మండపంలో పూజలు నిర్వహించిన తూర్పు మండలం అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య



లింగంపల్లిలో గణనాథుడికి పూజలు నిర్వహించిన జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు



గోల్నాక శాంతినగర్‌లో మండపంలో ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నవయువక సంఘం నిర్వాహకులు



రాంనగర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి



బాగ్‌అంబర్‌పేటలో గణనాథుడి పూజలో మాజీ కార్పొరేటర్ కె. పద్మావతిడీపీరెడ్డి తదితరులు



కాచిగూడలో అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తదితరులు

బీసీలకు మరో నాలుగు మంత్రి పదవులు ఇవ్వాలి

రాంనగర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు మరో నాలుగు మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం కోటా ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు ఆరు మంత్రి పదవులు రావాలని, ప్రస్తుతం ఇద్దరికి మాత్రమే ఇచ్చారని, మరో నలుగురికి ఇచ్చి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. అన్ని బీసీ కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి పాలక మండలిని నియమించాలన్నారు. వంద బీసీ గురుకుల పాఠశాలలు, 50 ఇంజనీరింగ్ కాలేజీలు, రెండు యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని, కాలేజీల్లో చదువుతున్న బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ సంఘం నాయకులు నీల వెంకటేష్, అనంతయ్య, నంద గోపాల్, సి. సతీష్, రాజేందర్, రవియాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

సహజ హాస్యం పండించే నటుడు బాబుమోహన్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): సహజ హాస్యం పండించే నటుడు బాబుమోహన్ అని ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. వంశీ ఆర్ట్స్ థియేటర్స్ 53వ వార్షికోత్సవం సందర్భంగా బాబుమోహన్‌కు నాటి హాస్యనటుడు రేలంగి వెంకట్రామయ్య పేరిట వంశీ జాతీయ పురస్కారం ప్రదానం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అశోక్‌తేజ ఆయనను సత్కరించి మాట్లాడారు. వంశీ రామరాజు ఎందరికో సన్మానాలు చేసేవారని, తనకు తొలి శాలువా వంశీ సంస్థ కప్పి సత్కరించింది అని, అది రాష్ట్రపతి శాలువా కప్పేస్థాయికి తెచ్చిందన్నారు. బాబూమోహన్ మాట్లాడుతూ.. బాబుమోహన్ పాట ఉంటే సినిమా ఆడుతుంది అనే స్థాయికి చిత్రసీమ తనను ఎదిగేలా చేసిందన్నారు. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ.. బాబు మోహన్ నటనలో గొప్ప చతురత ఉందన్నారు. వంశీ రామరాజు మాట్లాడుతూ.. అక్కినేని, దాసరి నారాయణరావు, సినారె తనను ప్రోత్సహించారని, సుబ్బిరామిరెడ్డి సహకారం తమ సంస్థకు మరువలేనిదని చెప్పారు. గజల్ శ్రీనివాస్, రేలంగి నరసింహారావు, రామసత్యనారాయణ, పొత్తూరి సుబ్బారావు పాల్గొన్నారు.



బాబుమోహన్‌ను సన్మానిస్తున్న సుద్దాల అశోక్‌తేజ

'మన ఐక్యత హెబ్రోన్ సంస్థలకు సందేశం కావాలి'

చిక్కడపల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మన ఐక్యత హెబ్రోన్ సంస్థలన్నింటికీ ఒక సందేశం కావాలని హెబ్రోన్ చర్చి పెద్దలు అన్నారు. దైవ సేవకులు, సంఘ సభ్యులు, సంధాన కర్తలతో గురువారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు మధ్యవర్తిత్వంతో అన్ని పక్షాల వారు బేషరతుగా కేసులను ఉపసంహరించుకుంటామని తెలిపారు. బ్రదర్ జాన్ సుబ్బారెడ్డి, జోసెఫ్ కురియన్, జేసీ రావు మాట్లాడుతూ.. ఒకరిని ఒకరు క్షమించుకుంటూ ముందుకు సాగడమే మన ప్రథమ కర్తవ్యమన్నారు. బ్రదర్ శాంసన్ వర్గాన్ని కలుపుకుని ముందుకు సాగాలని ఎఫ్‌సీఎస్ పీటర్ ప్రతిపాదించడం శుభపరిణామన్నారు. బ్రదర్ జాన్ స్టీవర్ట్ హెబ్రోన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం బాధ్యతలు నిర్వహిస్తారని, ఎఫ్‌సీఎస్ పీటర్, బ్రదర్ జోసెఫ్ కురియన్ అధ్యక్షతన అకౌంట్స్ విభాగం నడుస్తుందని తెలిపారు. ఈ బాధ్యతలన్నీ కొన్ని నెలల వరకే పరిమితమన్నారు. బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన ఈ సంస్థను పునరుద్ధరించే బాధ్యతలు బ్రదర్ ఎంఎఫ్ పీటర్, ఎం. రూబిన్ ఫ్రాన్సిస్ చూస్తారన్నారు. కార్యక్రమంలో ఆనంద్ రాజ్, ఏసుపాదం, ప్రేమ్‌సాగర్, శామ్యూల్, జకరయ్య పాల్గొన్నారు.

చేనేత కార్మికుల ఆత్మహత్యలను నివారించండి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): పని లేకపోవడం వల్ల చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆరోపించింది. గురువారం బర్కత్‌పురలో జరిగిన సమావేశంలో చేనేత కార్మిక సంఘం నేత బి. లక్ష్మీనర్సయ్య, వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాషా బత్తిని రాజేశం, ప్రధాన కార్యదర్శి చేశరాజేశ్వర్, కోశాధికారి గవ్వల శంకర్ మాట్లాడారు. చేనేత కార్మికుల సంక్షేమానికి పథకాలను ప్రవేశపెట్టి ఆత్మహత్యలను నివారించాలని కోరారు. చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ పీజీకే వెంకటేశ్వర్‌రావు, జి. వెంకటేశ్వర్లు, వేముల బాలరాజు, రాపోలు జగన్, రాపోలు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నికార్సయిన కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి

నల్లకుంట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపట్ల ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య సంతాపం తెలిపారు. నికార్సయిన కమ్యూనిస్టు యోధుడు, దేశ ప్రజల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా పోరాడిన రాజకీయ వేత్త ఏచూరి అని కొనియాడారు. దేశ రాజకీయ నాయకులు సీతారాం ఏచూరిని ఆదర్శంగా తీసుకుని జాతి నిర్మాణం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

అత్యుత్తమ పార్లమెంటేరియన్

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల హరియాణ గవర్నర్ బండారు సంతాపం ప్రకటించారు. ఏచూరి తనకు అత్యంత ఆత్మీయ సన్నిహితులని, చిన్న వయస్సులోనే సీపీఎం పార్టీలో చేరారన్నారు. ఆయన ఉత్తమ పార్లమెంటేరియన్ అని శ్లాఘించారు.



సీపీఎం నగర కార్యాలయంలో సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్, నాయకులు



నిమజ్జనం రూట్ మ్యాప్‌పై అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్

వినాయక నిమజ్జనం రోజు

ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోండి

అంబర్‌పేట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం రూట్ మ్యాప్‌పై అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్ అంబర్‌పేటలో అధికారులతో కలిసి పరిశీలించారు. అంబర్‌పేటలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్న దృష్ట్యా రామంతాపూర్, మూసారాంబాగ్ నుంచి ఈనెల 17న నిమజ్జనానికి వచ్చే విగ్రహాలతో ట్రాఫిక్ జామ్ కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులో చర్చించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి, కాచిగూడ ఏసీపీ రఘు, ట్రాఫిక్ ఏసీపీ సంపత్, అంబర్‌పేట సీఐ అశోక్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

28 నుంచి ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సమావేశం

నల్లకుంట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మధుర (బృందావన్)లో జరుగుతాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, ఐఎఫ్‌డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యుడు మామిడి సోమయ్య, ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం తెలిపారు. గురువారం కౌన్సిల్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర ప్రతినిధులతో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ఆఫీస్ బేరర్లు, జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఆయా రాష్ట్రాల అనుబంధ జర్నలిస్టు యూనియన్‌ల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ న్యూస్‌పేపర్స్ న్యూస్ ఏజెన్సీస్ ఎంప్లాయీస్ యూనియన్‌ల సమావేశం కూడా జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యాచరణ రూపొందిస్తారన్నారు. నేషనల్ కౌన్సిల్ సభ్యుడు ఎర్రమిల్లి రామారావు పాల్గొన్నారు.

'కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయండి'

చిక్కడపల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం జవహర్‌నగర్‌లో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గూండా రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యమంటే దాడులు చేయడమా అని మండిపడ్డారు.



సీపీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

ముషీరాబాద్: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగర పోలీస్ కమిసర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముఠా జైసింహ, వై. శ్రీనివాసరావు, సుధాకర్ గుప్తా, శంకర్‌గౌడ్, మహ్మద్ అలీ, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మహిళలను కించపరిచే విధంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బాగ్‌అంబర్‌పేట నుంచి తెలంగాణ భవన్ వరకు కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌశిక్‌రెడ్డి పద్ధతి మార్చుకోకపోతే తెలంగాణలో తిరగనీయబోమని, ఆయన కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.



టీఆర్‌ఎస్ భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న ఉషశ్రీ తదితరులు

ఆరెకపూడి గాంధీపై అనుచిత వ్యాఖ్యలు తగదు

నల్లకుంట: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, మహిళలను కించపరిచేలా మాట్లాడడం తగదని, వెంటనే క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం హైదర్‌గూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెంటిమెంట్‌ను వాడుకుని పబ్బం గడుపుకున్న వారిని బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆరెకపూడి గాంధీ స్థానికుడు కాదంటూ కౌశిక్‌రెడ్డి విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు.

రైలులో నగలు చోరీ

బర్కత్‌పుర, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రైలులో చోరీ జరిగింది. బంగారు ఆభరణాలుగల మహిళ బ్యాగ్‌ను దొంగలు అపహరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఔరంగాబాద్‌కు చెందిన ప్రవీణ్‌జైన్ భార్యతో కలిసి లాల్‌ఘడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడ వస్తున్నారు. కామారెడ్డి రైల్వే స్టేషన్ సమీపంలో అతడి భార్య తలకింద పెట్టుకున్న బ్యాగును దొంగలు అపహరించారు. అందులో 38 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 4,500 ఉన్నాయని ప్రవీణ్ జైన్ గురువారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ తెలిపారు.

భవనంపై నుంచి పడి బాలుడి మృతి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాచిగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బిగూడలో ఓ అపార్ట్‌మెంట్‌లో నేపాల్‌కు చెందిన తాపా వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతడి కుమారుడు హరీష్ (మూడున్నరేళ్లు) అన్న ధర్మతో కలిసి ఆడుకోవడానికి అపార్ట్‌మెంట్ పైకి వెళ్లారు. మంగళవారం రాత్రి నాలుగో అంతస్తులో ఆడుకుంటూ హరీష్ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాలుడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం

బర్కత్‌పుర, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థిని అదృశ్యమైంది. కాచిగూడ ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్‌లో నివసిస్తున్న జి. జాహ్నవి(21) బర్కత్‌పురలోని శారదాదేవి మహిళా డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతోంది. బుధవారం కళాశాలకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి గాలి స్వరాజ్యలక్ష్మి కాచిగూడ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.